కాంట్రాక్టు ఉద్యోగుల్లో అవధుల్లేని ఆనందం

- 20 ఏళ్ల నిరీక్షణకు ప్రతిఫలం
- సీఎం జగన్ నిర్ణయంపై హర్షం

ఆకివీడు: రాష్ట్రంలో కాంట్రాక్టు ఉద్యోగుల ఆనందానికి ఆకాశమే హద్దు అయ్యింది. వారి సంతోషానికి అవధుల్లేవు. 20 ఏళ్ల నిరీక్షణకు దక్కిన ప్రతిఫలం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వల్లే సాధ్యమైందని వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగ భద్రతలేక, చాలీచాలని జీతాలతో, పని భారపు ఒత్తిళ్ళతో మానసికంగా, ఆర్థికంగా కృంగిపోతున్న కాంట్రాక్టు ఉద్యోగులకు కొత్త ఊపిరి పోసిన సీఎం జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటామని వారు పేర్కొంటున్నారు. ఏళ్ల తరబడి పోరాటాలు చేసి అలసి, సొలసిన జీవితాల్లో వెలుగులు నింపారంటున్నారు.

5 ఏళ్ల సర్వీసు ప్రతిపాదనకు చెక్

గతంలో 2014 జూన్ 2 నాటికి 5 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న కాంట్రాక్టు ఉద్యోగుల్ని మాత్రమే పర్మినెంట్ చేసే ప్రతిపాదనకు చెక్ పెట్టి, పై తేదీ నాటికి సర్వీసులో ఉన్న ప్రతి కాంట్రాక్టు ఉద్యోగిని రెగ్యులరైజ్ చేస్తూ అసెంబ్లీ తీర్మానం చేయడం పట్ల వారిలో ఆనందం మరింత వెల్లివిరుస్తోంది. ఈ విధానంతో ఎక్కువ మంది కాంట్రాక్టు ఉద్యోగులకు ఫలితం దక్కుతుందని వారు పేర్కొంటున్నారు. రెండు దశాబ్దాలకు పైగా కాంట్రాక్టు ఉద్యోగిగా సర్వీసులో ఉన్న వారందరినీ పర్మినెంట్ చేయడం చరిత్రలో మరో మైలురాయిని అధిగమించడమేనని వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో కాంట్రాక్టు ఉద్యోగులుగా ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లోని అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, పారా మెడికల్ సిబ్బంది అధికంగా ఉన్నారు. వీరి సర్వీసులను రెగ్యులరైజ్ చేయడంతో ప్రభుత్వ వసతులన్నీ పొందే అవకాశం ఏర్పడుతుంది. జిల్లాలోని 14 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో 113 మంది కాంట్రాక్టు అధ్యాపకులు, 4 ఎయిడెడ్ కాలేజీల్లో 24 కాంట్రాక్టు అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పనిచేస్తున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఏఎన్ఎంలు, ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లు, హెల్త్ అసిస్టెంట్‌లు(ఎంపీహెచ్ఏ(పురుషులు)లు మొత్తం సుమారు 150 మంది ఉన్నారు. సీహెచ్‌సీ, ఏరియా, జిల్లా ఆసుపత్రిలో కాంట్రాక్టు ఉద్యోగులు సుమారు 103 మంది ఉన్నారు. వీరిలో 2014కి ముందు ఉన్న వారి సంఖ్యను సర్వీసు రిజిస్టర్ బట్టి బయటకు తీయాల్సి ఉంది.



కాంట్రాక్టు ఉద్యోగులు (ఫైల్ ఫొటో)

కాంట్రాక్టు ఉద్యోగుల వివరాలు

ఫార్మసిస్టులు :	13
ల్యాబ్ టెక్నీషియన్లు :	16
ఏఎన్ఎంలు :	21
ఎంపీహెచ్ఏ(పురుషులు)హెల్త్ అసిస్టెంట్లు :	100

సీహెచ్‌సీ, ఏరియా, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రుల్లో మొత్తం 103 మంది కాంట్రాక్టు ఉద్యోగులు పని చేస్తున్నారు.

14 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో:	113 మంది
4 ఎయిడెడ్ కాలేజీల్లో :	24 మంది

బతుకు మీద ఆశ పుట్టింది



నిరాశ, నిస్పృహాలతో 20 ఏళ్లు గడిపిన జీవితానికి ఇప్పుడు బతుకు మీద ఆశ పుట్టింది. ఆర్థికంగా, మానసికంగా, శారీరకంగా భరించలేని బాధలతో, అభద్రతా భావంతో ఉద్యోగంలో కొనసాగాం. నేను ఉన్నాను అని చెప్పిన సీఎం జగన్ ఎప్పటికైనా తమను పర్మినెంట్ చేస్తారనే నమ్మకం కల్గింది. అది నేడు నెరవేరింది. మా కలలు సాకారం చేసిన సీఎం జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటాం. ఎన్నో పోరాటాలు చేసి సాధించిన ఉద్యోగ సంఘాల నాయకులకు ధన్యవాదాలు.

– ఎం.విజయ కుమార్, ల్యాబ్ టెక్నీషియన్, ఆకివీడు.

జూనియర్ కాలేజీల్లో 137 మంది



జిల్లాలోని 14 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో సుమారు 113 మంది కాంట్రాక్టు అధ్యాపకులు, 4 ఎయిడెడ్ కాలేజీల్లో 24 మంది కాంట్రాక్టు అధ్యాపకులు పనిచేస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయంతో వీరి సర్వీసులు రెగ్యులర్ అయ్యే అవకాశం ఉంది.

–ఎం.నర్సింహమూర్తి, డీవీఈఓ, భీమవరం.

గణనాథునికి పీవీఎల్ ప్రత్యేక పూజలు

ఉండి: మండలంలోని యండగండిలో వేంచేసి యున్న లక్ష్మీగణపతి ఆలయంలో స్వామివారిని దర్శించుకున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. గణపతి నవరాత్రి మహోత్సవాల సందర్భంగా గ్రామంలో వినాయకుడి విగ్రహాల ఊరేగింపును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పాలన ఆ భగవంతుని దయ వల్ల చాలా గొప్పగా జరుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

కాళ్ల: గణపతి నవరాత్రులు సందర్భంగా బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో వినాయక ప్రతిమలను భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. జువ్వలపాలెంలో ప్రత్యేక వాహనంపై గణనాథుడిని ఊరేగించారు. విచిత్ర వేషధారణలు, బుట్టబొమ్మలు ఆకట్టుకున్నాయి. కాళ్ళకూరు తదితర గ్రామాల్లో వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించి విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి పంట కాలువల్లో నిమజ్జనం చేశారు.

ఆకివీడులో..

ఆకివీడు: స్థానిక శాంతినగర్‌లోని వరసిద్ధి వినాయక స్వామి ఆలయం వద్ద హోమాలు, పూజలు నిర్వహిస్తున్నారు. ప్రధాన రహదారిలోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద పూలు, పండ్ల వర్తక సంఘం ఆధ్వర్యంలో గణనాథుడికి పూజలు కొనసాగుతోన్నాయి. కాగా పలుచోట్ల వినాయక విగ్రహాల్ని ట్రాక్టర్లపై ఊరేగించారు. అనంతరం వెంకయ్య వయ్యేరు పంట కాల్వలో గణపయ్యను చేశారు. ఆయా కార్యక్రమాల్లో యువకులు, బాలలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: గణపతి నవరాత్రుల మహోత్సవాల్లో భాగంగా పాలకొల్లు పట్టణంలో గణపతి నిమజ్జనోత్సవ కార్యక్రమం బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. తొమ్మిదిరోజులు పాటు భక్తులచే పూజలందుకున్న గణనాథులను ఊరేగింపుగా తరలించి పట్టణంలో సాయిబాబా ఆలయం వద్ద నిమజ్జనం చేశారు. స్థానిక యడ్లబజారు సెంటర్, బ్రాడీపేట, పెనుమదం రోడ్డు, వెలమగుడెం ప్రాంతాల నుండి వచ్చిన గణనాథులను గాంధీబొమ్మల సెంటర్ నుంచి సాయిబాబా ఆలయం వద్దకు తరలించి నిమజ్జనం చేశారు.



యండగండిలో వినాయకుడిని దర్శించుకుంటున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

స్వల్పకాలిక కోర్సులో చేరండి

ఉండి: లాజిస్టిక్ స్కిల్ కౌన్సిల్(ఎస్ఎస్‌డీసీ) సహకారంతో వేర్‌హౌస్ అసిస్టెంట్ అనే స్వల్పకాలిక కోర్సును ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారం లోని ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశపెట్టడం జరిగిందని ఐటీఐ జిల్లా కన్వీనర్ వి.శ్రీనివాసరాజు బుధవారం తెలిపారు. 10 తరగతి పాసై 18 నుండి 35 ఏళ్ల మధ్య వయస్కులైన స్త్రీ, పురుష అభ్యర్థులు ఈ కోర్సులో చేరేందుకు అర్హులన్నారు. సాధారణ ఇంగ్లీష్ పరిజ్ఞానం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈ కోర్సులో చేరేవారికి నెలరోజుల పాటు అమెజాన్‌లో ప్రత్యేక శిక్షణ కోసం పంపడం జరుగుతుందన్నారు. ఈనెల 30వ తేదీలోగా ఆసక్తి గల నిరుద్యోగ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

సాక్షి, భీమవరం: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించే దిశగా ప్రభుత్వం ఆలోచించాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి డి కళ్యాణి, సీఐటీయూ నాయకుడు శ్రీను అన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తల అరెస్టులు, నిర్బంధానికి నిరసనగా బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు.

కౌలు రైతులకు షరతుల్లేకుండా రుణాలివ్వాలి

సాక్షి, భీమవరం: భూయజమాని బ్యాంకు రుణంతో సంబంధం లేకుండా కౌలు గుర్తింపు కార్డులు పొందిన కౌలు రైతులందరికీ ఎటువంటి షరతులు లేకుండా పంట రుణాలు ఇవ్వాలని కౌలు రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు డిమాండ్ చేశారు. బుధవారం కౌలు రైతులకు బ్యాంకు రుణాలు ఇవ్వాలని జిల్లా లీడ్ బ్యాంకు, కలెక్టరేట్ వద్ద నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. జిల్లాలో కౌలురైతులు పంట పెట్టుబడులకు ప్రైవేటు వ్యక్తులను ఆశ్రయించి అధిక వడ్డీలకు అప్పులు తెస్తున్నారని అందువల్ల సీసీఆర్‌సీ కార్డులు పొందిన కౌలురైతులకు బ్యాంకులు రుణాలు ఇవ్వడం ద్వారా ఆదుకోవాలన్నారు. కౌలు గుర్తింపు కార్డులు పొందిన కౌలు రైతులందరికీ ఎటువంటి షరతులు లేకుండా పంట రుణాలు మంజూరు చేయాలని రామాంజనేయులు కోరారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్, లీడ్ బ్యాంకు మేనేజరు కార్యాలయాల్లో అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కె సుబ్బరాజు, కె శ్రీనివాస్, పి జార్జిబాబు, వై నారాయణమూర్తి, పి కామేశ్వరరావు, కె పెద్దిరాజు, జె రంగారావు, జినాగేంద్రకుమార్ పాల్గొన్నారు.



భీమవరంలో కౌలు రైతులకు రుణాలివ్వాలని వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

డ్రైయిన్లలో పూడిక తొలగించాలి

సాక్షి, భీమవరం: రాయలం డ్రైయిన్, చినఅమిరం మీడియన్ డ్రైయిన్‌లో కిక్కిరస పేరుకుపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రైతు కార్యాచరణ సమితి నాయకుడు పాతపాటి మురళీ రామరాజు అన్నారు. బుధవారం చినఅమిరంలో నిర్వహించన కార్యాచరణ సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. డ్రైయిన్లలోని నీరు ముందుకు వెళ్లకపోవడంతో ఈ ప్రాంతంలో సుమారు 600 ఎకరాల్లో నాట్లు వేయలేదని, కొంత ప్రాంతంలో పైరు నీట మునుగుతున్నట్లు చెప్పారు. గతంలో సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లడంతో నీటిపారుదల, డ్రైయినేజీ శాఖాధికారులు పరిశీలించారని తరువాత డ్రైయిన్లలోని గుర్రపుడెక్క, తూడును తొలగించి కిక్కిసను తొలగించకపోవడం ముంపు సమస్య పరిష్కారం కాలేదన్నారు. సార్వా సీజన్‌లో అవసరం మేరకే నీరు విడుదల చేస్తే రైతులకు కొంత ప్రయోజనం కలుగుతుందన్నారు. రైతుల సమస్యలపై కలెక్టర్‌ను కలిసి సమస్యను వివరిస్తామని మురళీరామరాజు తెలిపారు. ఈ సమావేశంలో రైతులు గొట్టుముక్కల రామరాజు, తమ్మినీడి నాగేశ్వరరావు, వత్సవాయి రామరాజు, గొట్టుముక్కల పద్మరాజు, గుడిమెట్ల నాగేశ్వరరావు, గొట్టుముక్కల మురళీ కృష్ణంరాజు, మంతెన వెంకటేశ్వరరాజు పాల్గొన్నారు.



రామాలయంలో రైతు కార్యాచరణ సమితి సమావేశంలో మాట్లాడుతున్న మురళీరామరాజు

ప్రజారోగ్య సంరక్షణే ప్రభుత్వ ధ్యేయం

ఉండి: ప్రజారోగ్య సంరక్షణే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల్లో వైద్య, ఆరోగ్య సిబ్బంది జోరుగా సర్వే నిర్వహిస్తున్నారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి పరీక్షలు నిర్వహిస్తున్నారు. అలాగే ప్రజల ఆరోగ్య వివరాలతో కూడిన రికార్డులను ఎప్పటికప్పుడు భద్రపరుస్తామని మండల ఆరోగ్యాధికారి డాక్టర్ పి.ధర్మతేజ్ తెలిపారు.

ఇంటింటా సర్వేతో ఆరోగ్య రక్షణ

ఆకివీడు: ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలనే ధ్యేయంతో ప్రభుత్వం ఇంటింటికీ ఆరోగ్య సిబ్బందిని పంపించి పరీక్షలు చేయిస్తోందని ఎంపీడీఓ కందుల వాణి చెప్పారు. మండలంలోని చిన కాపవరం గ్రామంలో చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను బుధవారం పీహెచ్‌సీ వైద్యాధికారిణి మెహరున్నీసా బేగంతో కలిసి పర్యవేక్షించారు. 30వ తేదీ నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు ప్రారంభమవుతాయని చెప్పారు. 30న చినకాపవరం, సెప్టెంబర్ 3న అప్పారావుపేట, 4న చెరుకుమిల్లి, 5న చినమిల్లిపాడు, 6న దుంపగడప, 7న గుమ్ములూరు, 9న కోళ్లపర్రు, 10న సిద్ధాపురం, 11న అజ్జమూరు, 12న కుప్పనపూడి, 13న అయిభీమవరం, 18న ఆకివీడులోని 5 సచివాలయాల పరిధిలో జరుగుతాయని వివరించారు.

30 నుంచి వైద్య శిబిరాలు

ఉండి: ఈనెల 30వ తేదీ నుంచి మండలంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు మండల ఆరోగ్యాధికారి డాక్టర్ పి.ధర్మతేజ్ బుధవారం తెలిపారు. ఉండి, యండగండి ఆరోగ్య కేంద్రాల పరిధిలో డాక్టర్ పి.ధర్మతేజ్, డాక్టర్ బెన్నీ శామ్యూల్, డాక్టర్ సాయిచంద్ర, డాక్టర్ కీర్తన ఆధ్వర్యంలో ఈ శిబిరాలు నిర్వహిస్తారని తెలిపారు. ప్రారంభ కార్యక్రమాన్ని ఈనెల 30వ తేదీన చిలుకూరు గ్రామంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



ఆకివీడు మండలం చిన కాపవరంలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో కందుల వాణి

మెరుగైన ఆహార అలవాట్లతో ఆరోగ్యం

భీమవరం(ప్రకాశంచౌక్): భీమవరం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా భీమవరం అర్బన్ పరిధిలో స్థానిక బలుసుమూడి– 216 అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, తల్లులకు పోషకాహారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ లక్ష్మీకాంతం సూపర్ వైజర్ సరోజిని డబ్ల్యూఎంఎస్‌కే భవ్య శ్రీ, ఏఎన్ఎం లక్ష్మీప్రసన్న అంగన్‌వాడీ కార్యకర్త కృష వేణి, మేరీ గ్రేస్ శాంత కుమారి, గర్భిణు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో స్వచ్ఛ పక్వాడా కార్యక్రమం నిర్వహించిన అంగన్‌వాడీ కేంద్రం పరిసరాలను శుభ్రపరిచి, మొక్కలు నాటారు.అనంతరం జరిగిన సమావేశంలో ప్రాజెక్టు ఆఫీసర్ తల్లులుతో మాట్లాడుతూ మెరుగైన ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాలు ఆహార పంపిణీ కేంద్రాలుగా మాత్రమే కాకుండా విజ్ఞానాన్ని అందించే కేంద్రాలుగా తయారు కావాలని ఆదేశించారు.



పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

భగత్‌సింగ్, రాజా రామ్‌మోహన్‌రాయ్‌కు ఘన నివాళి

భీమవరం(ప్రకాశంచౌక్): దేశంలో గొప్ప దేశభక్తులుగా, మానవతావాదులుగా, మేధావులుగా భగత్‌సింగ్, రాజారామ్‌మోహన్ రాయ్‌లు చరిత్రలో నిలిచిపోతారని అల్లూరి సీతారామరాజు భగత్‌సింగ్ సేవా వైద్య కేంద్రానికి చెందిన వి.రాధాకృష్ణ అన్నారు. భగత్‌సింగ్ 115వ జయంతి, రాజా రామ్మోహన్ రాయ్ 190వ వర్ధంతి సందర్భంగా అల్లూరి సీతారామరాజు భగత్ సింగ్ వైద్య సహాయ కేంద్రం వద్ద బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో వారికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ రెండు పదుల వయసులోనే బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన భగత్‌సింగ్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచారన్నారు. 18వ శతాబ్దం ప్రారంభంలోనే రాజా రామ్మోహన్ రాయ్ మూఢ విశ్వాసాలపై పోరాటం చేశారన్నారు. మహిళల అభ్యున్నతి, సమానత్వం కోసం సతీసహగమనానికి వ్యతిరేకంగా పోరాటం చేసి దురాచారమైన సతిని చట్టరూపంలో రద్దు చేయించ గలిగారన్నారు. వైఎస్సార్ సీపీ కన్వీనర్ తోట భోగయ్య మాట్లాడుతూ భగత్ సింగ్, సంఘ సంస్కర్త రాజా రామ్మోహన్ రాయ్ లాంటి మహనీయులను ఎల్లప్పుడు మనం గుర్తించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కామన నాగేశ్వరరావు, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకుడు ఇంటి సత్యనారాయణ మేంటే వారి తోట యూత్, వైద్య సహాయ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

వేధింపులపై ఫిర్యాదు

ఆకివీడు: భీమవరానికి చెందిన ఉప్పాడ మౌనిక సెల్‌ఫోన్ ద్వారా అసభ్యకర పోస్టులు పెడుతూ తనను వేధిస్తోందని మండలంలోని సిద్ధాపురం గ్రామానికి చెందిన యాళ్ళ శోభారాణి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగబాబు చెప్పారు.

కోడి పందేలపై దాడి

ఆకివీడు: మండలంలోని చెరుకుమిల్లి గ్రామంలో కోడి పందేలు ఆడుతుండగా బుధవారం దాడి చేసి ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్సై నాగబాబు చెప్పారు. వారి వద్ద నుంచి రూ.1,300 నగదు, రెండు కోళ్లు, రెండు కోడి కత్తులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

మహిళపై దాడి

సాక్షి, భీమవరం: భీమవరం పట్టణంలోని టిడ్కో గృహాల వద్ద బి వెంకటలక్ష్మిని అదే ప్రాంతానికి చెందిన ఎ.నాగేశ్వరరావు కొట్టి గాయపర్చాడంటూ అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు భీమవరం వన్ టౌన్ ఏఎస్సై దేవరాజు చెప్పారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. తాడేరు రోడ్డులోని టిడ్కో గృహాల వద్ద నివాసిస్తున్న వెంకటలక్ష్మి ఈనెల 26న బట్టలు ఆర వేసుకుంటుండగా అక్కడికి వచ్చిన నాగేశ్వరరావు అసభ్యకరంగా మాట్లాడడమేగాక బకెట్‌తో కొట్టిగాయపర్చాడు. ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న వెంకటలక్ష్మి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. మహిళపై దాడి ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు భీమవరం వన్ టౌన్ ఏఎస్సై దేవరాజు చెప్పారు.

క్లుప్తంగా

అమ్మవారి ఆలయం వద్ద అన్నదానం

భీమవరం(ప్రకాశంచౌక్): శ్రీ గణపతి నవరాత్రులు ముగింపు సందర్భంగా మావుళ్లమ్మవారి ఉపాలయం విఘ్నేశ్వరస్వామి ఆలయ అన్నదాన కార్యక్రమాన్ని గ్రంధి రవితేజ, కొయ్యే సుందర్‌రాజు ప్రారంభించారని ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి యర్రంశెట్టి భద్రాజీ తెలిపారు. సుమారు 3 వేల మంది భక్తులు పైగా అన్నప్రసాదం స్వీకరించారని తెలిపారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మానేపల్లి నాగేశ్వరరావు, ధర్మకర్తలు రామాయణం సత్యనారాయణ ,ముత్యాల రామారావు, మావూరి సుందరరావు, తాళ్లపూడి భాగ్యలక్ష్మి, గోపిశెట్టి విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఉండి తహసీల్దార్‌గా శ్రీనివాస్

ఉండి: ఉండి నూతన తహసీల్దార్‌గా ఏడిద శ్రీనివాస్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఉత్తర్వుల మేరకు నర్సాపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏవోగా పనిచేస్తున్న శ్రీనివాస్ ఉండి తహసీల్దార్‌గా నియమితులయ్యారు. ఆయనకు డిప్యూటీ తహసీల్దార్ ఎస్వీస్ నాయుడు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా రెవెన్యూ కార్యాలయ అధికారులు, వీఆర్వోలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

కాళ్లకూరు వెంకన్న హుండీ ఆదాయం లెక్కింపు

కాళ్ల: కాళ్లకూరు గ్రామంలో వేంచేసియున్న స్వయంభు శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం స్వామివారి హుండీ ఆదాయాన్ని లెక్కించారు. 80 రోజులకు గానూ స్వామివారికి రూ.15,80,107 ఆదాయం సమకూరినట్లు ఈవో మోకా అరుణ్ కుమార్, దేవస్థాన చైర్మన్ డీవీ కృష్ణంరాజు తెలిపారు. హుండీ లెక్కింపులో రామలింగేశ్వర స్వామి దేవస్థానం ఈవో దండు కృష్ణంరాజు, భీమేశ్వర స్వామి దేవస్థానం ఈవో అల్లూరి సత్యనారాయణ రాజు, జ్ఞానానంద పబ్లిక్ స్కూల్ విద్యార్థులు, మహిళా మండలి సభ్యులు, దేవాదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య పనులకు ప్రత్యేక చర్యలు

ఆకివీడు: పట్టణంలో పారిశుధ్య పనులకు ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి తెలిపారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో బుధవారం సర్వసభ్య సమావేశం చైర్‌పర్సన్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ఆమె మాట్లాడుతూ పట్టణంలో వ్యాధులు ప్రబలకుండా సామాజిక ఆరోగ్య కేంద్రం, నగర పంచాయతీ పారిశుధ్య సిబ్బందితో ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు. తొలుత అజెండాలోకి వచ్చిన అంశాన్ని సమావేశం ఆమోదించింది. కౌన్సిలర్ నిమ్మల నాగు మాట్లాడుతూ వీధిలైట్లు కొన్నిచోట్ల వెలగడం లేదని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. పట్టణంలో జాతీయ రహదారి పక్కన కై కలూరు, భీమవరం వైపు వెళ్లే బసులు నిలుపుదల చేసే ప్రాంతంలో స్థలం కేటాయిస్తే లయన్స్ అభయ క్లబ్ ద్వారా బస్ షెల్టర్ నిర్మాణం చేపడతామని తెలిపారు. సమావేశంలో వైస్ చైర్మన్లు పుప్పాల పండు, వంగా జ్యోత్స్న, చీఫ్ విప్ పడాల శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్లు పాల్గొనగా, ప్రతిపక్ష కౌన్సిలర్లు నోటికి నల్ల రిబ్బన్‌లు కట్టుకుని సమావేశానికి హాజరయ్యారు.

హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపిక

ఉండి: ఈనెల 26న ఏలూరులో జరిగిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్‌లో భాగంగా హ్యాండ్‌బాల్ రాష్ట్రస్థాయి అండర్ 14, జిల్లా స్థాయి అండర్ 17 జట్లకు ఎన్నార్పీ అగ్రహారం జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్ఎం ఎంవీ సత్యనారాయణ తెలిపారు. రాష్ట్ర, జిల్లాస్థాయి జట్లకు ఎంపికై న విద్యార్థులకు బుధవారం పాఠశాలలో అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాలకు చెందిన ఎల్‌జే ప్రతిభ, పి.చంద్రశేఖర్ నాయుడు రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ అండర్ 14 జట్టుకు, కె.మహాలక్ష్మి, ఎ.కార్తీక్ అండర్ 17 జట్లకు ఎంపిక కావడం సంతోషంగా ఉందని హెచ్ఎం అన్నారు. ఈ సందర్భంగా పీఈటీ కె.శ్రీనివాసరావును ఆయన అభినందించారు.

సామూహిక ఎలుకల నిర్మూలన

కాళ్ల: సామూహిక ఎలుకల నిర్మూలనతో రైతులకు మేలు చేకూరుతుందని మండల వ్యవసాయాధికారి సీహెచ్ జయవాసుకి, కాళ్ల సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ సుంకర భోగేశ్వరరావు అన్నారు. బుధవారం మండలంలోని గ్రామాల్లో రైతులకు ఎలుకల నిర్మూలనకు బ్రోమోడైల్ మందు పంపిణీ చేశారు. కాళ్ల రైతు భరోసా కేంద్రం వద్ద భోగేశ్వరరావు ఎలుకల నిర్మూలనకు మందు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సభ్యుడు పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, ఎంపీపీ పెనుమత్స విశ్వనాథరాజు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వ్యవసాయ శాఖ, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

మెనూ అమలు చేయాలి

ఉండి: వసతి గృహాల్లో రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన మెనూను తప్పనిసరిగా అమలు చేయాలని ఎంపీపీ ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు అన్నారు. బుధవారం ఉండి మండల పరిషత్ కార్యాలయంలో ఉండి బీసీ బాలికల వసతి గృహ సలహా సంఘ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ విద్యార్థినులు చదువుపై ప్రత్యేకంగా దృష్టి సారించేలా వారితో ఉదయం లేదా సాయంత్ర సమయాల్లో యోగా, మెడిటేషన్ వంటివి చేయించాలని సూచించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా వై.సత్యకిషోర్

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా వై.సత్య కిషోర్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఆయన రాజమండ్రిలోని ఇన్‌టిజెన్స్ విభాగంలోని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ విధులు నిర్వహించి బదిలీపై భీమవరం రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా సత్య కిషోర్ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు రూరల్ సీఐగా విధులు నిర్వహించిన నాగ ప్రసాద్ కృష్ణా జిల్లాలోని చల్లపల్లి పోలీస్‌స్టేషన్‌కు సీఐగా బదిలీపై వెళ్లారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన సీఐ వై. సత్య కిషోర్‌కు పలువురు పోలీస్ సిబ్బంది, నాయకులు పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు.

పీవీఎల్ పరామర్శ

కాళ్ల: మండలంలోని గోగుతిప్ప గ్రామంలో డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు బుధవారం పర్యటించారు. మాలవానితిప్ప సచివాలయం పరిధిలో గోగుప్ప గ్రామంలో ఇటీవల మరణించిన వైఎస్సార్ సీపీ నాయకుడు కొల్లాటి వెంకటేశ్వర్లు కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. వెంకటేశ్వర్లు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నర్సింహరాజు వెంట గ్రామ సర్పంచ్ సాగిరాజు సుబ్బరాజు, ఎంఎస్ఎన్ రాజు, పార్టీ నాయకులు ఉన్నారు.

మావుళ్లమ్మకు బంగారం సమర్పణ

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం పట్టణ ఇలవేల్పు మావుళ్లమ్మవారికి పట్టణానికి చెందిన జి.అప్పలరాజు, పార్వతి దంపతులు 8 గ్రాముల బంగారం సమర్పించారు. వారికి ఆలయ సిబ్బంది అమ్మవారి ప్రసాదం, రసీదును అందజేశారు. ముందుగా వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీ లెక్కిపు

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని దంతులూరి జగన్నాథరాజు సత్రం అనుబంధ సంస్థ శ్రీపద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం హుండీలను లెక్కించగా రూ.7,73,723 నగదు వచ్చిందని ఈఓ రుద్రరాజు గంగా శ్రీదేవి తెలిపారు. 184 రోజులకు ఈ ఆదాయం వచ్చినట్లు తెలిపారు. హుండీ లెక్కింపులో కె.శ్రీనివాసరావు, చైర్మన్ మంతెన రామకుమార్‌రాజు, ట్రస్ట్ బోర్డు సభ్యులు డి.లక్ష్మీపతిరాజు, ఆర్‌వీఎల్ నారాయణరాజు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.9 వేలు పలికిన లడ్డూ

వీరవాసరం: వినాయకుని లడ్డూను రూ.9 వేలకు వేలంలో బుధవారం దక్కించుకున్నారు. మండలంలోని రాయకుదురులోని గుడాల వారి వీధిలో ఏర్పాటుచేసిన వినాయక మండపంలో స్వామివారి లడ్డూ వేలం నిర్వహించారు. తోట రేవాన్ష్, వెంకట తనిష్ రూ.9 వేలకు వేలంలో లడ్డూను దక్కించుకున్నారు. ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి లడ్డూ ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు.

రేపు ఎంపీడీవో కార్యాలయంలో 'జగనన్నకు చెబుదాం'

పాలకోడేరు: ఈనెల 29వ తేదీన పాలకోడేరు మండల పరిషత్ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మురళి గంగాధరరావు తెలిపారు. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం మండల స్థాయిలో నిర్వహిస్తున్నామని, ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు రావాలని ఆయన కోరారు. ఇప్పటికే సంబంధిత అధికారులను అప్రమత్తం చేశామని, అధికారులకు సెలవులు కూడా రద్దు చేశారని తెలిపారు.

పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలి

సాక్షి, భీమవరం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్తు భారాలను ప్రజలపై మోపి తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని వామపక్ష నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం విస్సాకోడేరు వంతెన వద్ద వారు ధర్నా నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జేఎన్‌వీ గోపాలన్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆపార్టీ జిల్లా కార్యదర్శి బి బలరామ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల హక్కులను కాలరాస్తూ నూతన విద్యుత్ విధానం పేరుతో విద్యుత్తు రంగంలో సంస్కరణలను అమలు చేస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా నాయకుడు లంక కృష్ణమూర్తి, ఎంసీపీఐ నాయకుడు చంటి, బి వాసుదేవరావు, కె రాజారాంమోహన్‌రాయ్, చింతకాయల బాబూరావు, పీపీ ప్రతాప్, కర్రా నాగేశ్వరరావు, డి కళ్యాణి, చెల్లబోయిన రంగారావు, నర్సింహమూర్తి, రామాంజనేయులు, ఎం వైకుంఠరావు, మల్లుల సీతారాంప్రసాద్ పాల్గొన్నారు.